క్లుప్తంగా

జ్ఞానానికి నిధి గ్రంథాలయం



విద్యార్థులతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ విజయ భాస్కరరెడ్డి

అద్దంకి: జ్ఞానానికి నిధి గ్రంథాలయమని సంత మాగులూరు లైబ్రేరియన్ విజయ భాస్కరరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొని వివిధ పుస్తకాలు ఇష్టంగా చదివారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వీలున్నపుడు గ్రంథాలయానికి వచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానవంతులు అవుతారని చెప్పారు.

అంబటివారిపాలెంలో నేత్రదానం



వీరనారాయణ (ఫైల్)

చినగంజాం: ఇంకొల్లు మండలం అంబటివారి పాలెంలో అంబటి వీరనారాయణ (92) ఆదివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారు. వారి అనుమతి మేరకు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర నేత్రాలయం కంటి వైద్యులు డాక్టర్ ఆకాంక్ష, రుతుజాలు దాత నేత్రాలను సేకరించారు. వారి కుటుంబ సభ్యులు భార్య వీరమ్మ, కుమారులు ప్రతాప్ కుమార్, అంజమ్మ, నాగేశ్వరరావు, అంజన కుమార్తె పద్మ, అమ్మయ్య ఇతర కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), సోమేపల్లి రామ్మోహనరావు, క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ట్రెజరర్ అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు అభినందించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదాన కమిటీ 490వ నేత్రదానం పూర్తి చేసినట్లు తెలిపారు.

నేడు చర్చి పాస్టర్ల ఐక్య సదస్సు

చినగంజాం: మండలంలోని మోటుపల్లి పంచాయతీ నిరీక్షణ గిరి గ్రామంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజాసత్తా చర్చి పాస్టర్ల సంక్షేమ అనుబంధ విభాగాల పాస్టర్స్ పవర్, క్రైస్తవ కుటుంబాల ఐక్యవేదిక క్రిస్టియన్స్ పవర్‌ల ఐక్య సదస్సు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజా సత్తా వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ చర్చిల పాస్టర్‌లు, పలు చర్చిల కుటుంబ సభ్యులు, యూనియన్‌లు నాయకులు పాల్గొనవచ్చని వివరాలకు 99893 85993 నంబర్ సంప్రదించాలి ఆయన కోరారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీ

మార్టూరు: అక్రమంగా గ్రానైట్ రాయి తరలిస్తున్న ఓ వాహనాన్ని ఆదివారం రాత్రి మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోజు వారి తనిఖీలో భాగంగా ఎస్సై కే కమలాకర్ తమ సిబ్బందితో కలిసి స్థానిక జాతీయ రహదారిపై నిఘా ఉంచారు. గ్రానైట్ రాయిని ఇతర రాష్ట్రానికి తరలిస్తున్న లారీ అధికారులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేని విషయం గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు గ్రహీతకు అభినందనలు



సుబ్బారావును సన్మానిస్తున్న సాంస్కృతి సేవా సంఘాల ప్రతినిధులు

అద్దంకి రూరల్: బెస్ట్ సోషల్ వర్కర్‌గా ఢిల్లీలో ఈనెల 24న అవార్డు పొందిన హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావును ఆదివారం గాడేపల్లి దివాకరదత్తు గృహంలో సాంస్కృతి సేవాసంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించి, అభినందనలతో ముంచెత్తారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు, విద్వాన్ చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, కొల్లా భువనేశ్వరీ, షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొండముది బంగారుబాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్ల యానాదిసంఘం జీవీవీకె పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని ప్రభుత్వం సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు పోట్లూరి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధాయుడు ఎం ఆంజనేయులు ఈ నెల 8న పాఠశాలలో మద్యం సేవించి అనంతరం అక్కడే మూత్రం పోసి పడిపోయాడు. విషయం తెలుసుకుని ఎంఈఓ నూకతోటి ప్రసాద్ వెళ్లి పరిశీలించి రిపోర్టు కూడా అందచేశారు. అయినా గిరిజన సంక్షేమ శాఖ కనీస చర్యలు తీసుకోలేదు. గిరిజన సంక్షేమ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదిలో పదిలంగా భవిష్యత్ భద్రంగా

- 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా పరీక్షలు
- ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ



కొడవలివారిపాలెంలో స్టడీ అవర్‌లో విద్యార్థులు

కారంచేడు: ప్రతి విద్యార్థి జీవితానికి పదో తరగతి పరీక్షలు ఒక మైలు రాయి. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఎక్కడ ఉన్నా మొదటి తీపి గుర్తుగా ఉండేది పదో తరగతి. ఇక్కడి నుంచే ఒక్కో మెట్టు ఎక్కుతూ జీవితాన్ని స్థిరపడేలా చేసుకుంటాం. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో 2020, 2021లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు లేకుండానే విద్యార్థులు తమ భవిష్యత్‌ను ముందుకు తీసుకెళ్లారు. 2022లో అనేక మంది విద్యార్థులు తమ భవిష్యత్‌కు బ్రేక్‌లు వేసుకోవాల్సిన పరిస్థితులున్నాయి. ఈ ఏడాది అలా కాకుండా ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టారు. ఉపాధ్యాయులు కూడా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ 10వ తరగతి పరీక్షల్లో నూర శాతం సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కారంచేడు మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, కొడవలివారిపాలెం, ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టేలా రేయి, పగలు కష్టపడి చదువుతున్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగే పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ పరీక్షలను కూడా నిర్వహిస్తూ రోజుకూ వారిలోని ప్రతిభ మెరుగుపరుస్తున్నారు. కారంచేడులో 138 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. యద్దనపూడి మండలంలో 289, చినగంజాం మండలంలో 388, పర్చూరు మండలంలో 570, మార్టూరులో 1011, ఇంకొల్లు మండలంలో 750 మంది విద్యార్థులు సిద్ధం అవుతున్నారు.

పదో తరగతికి సిద్ధం అయ్యే విద్యార్థులు

చినగంజాం	388	పర్చూరు	570
కారంచేడు	138	ఇంకొల్లు	750
మార్టూరు	1011	యద్దనపూడి	289

విద్యార్థులపై ఒత్తిడి లేని విద్యాబోధన..



మా పాఠశాల విద్యార్థులను మొదటి నుంచి ప్రతిభకు పదును పెడుతున్నాం. వారిపై ఒకేసారి ఒత్తిడి చేయడం లేదు. వారిలోని ప్రతిభకు పదును పెట్టేలా సబ్జెక్టు టీచర్లు కష్టపడి చదివిస్తున్నారు. ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నాం.

సీహెచ్ చెంచుపున్నయ్య, హెచ్‌ఎం, కేవీ పాలెం

లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కృషి..



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో గత ఏడాదికి మాదిరిగా ఈ ఏడాది కూడా మా లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతర కృషి చేస్తున్నాం. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా తగు జాగ్రత్తలతో మంచి నాణ్యమైన బోధనలతో పర్యవేక్షిస్తున్నాం. మండల స్థాయిలోను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

శ్రీకృష్ణ, ఉపాధ్యాయుడు, కేవీ పాలెం

స్పెషల్ క్లాస్‌లతో ఉపయోగకరంగా ఉంది..



మా పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో మా నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నాం. పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాం.

– సీహెచ్ రక్షణ, కేవీపాలెం

ప్రతి రోజూ పరీక్షలు జరుగుతున్నాయి..



ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా మా ప్రతిభ అర్థం అవుతుంది. రోజు రోజుకు మెరుగుపర్చుకుంటూ, పరీక్షలకు సిద్ధపడుతున్నాం.

– పీ హేమంత్, స్వర్ణ

వైభవంగా నీలంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్టు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

అద్దంకి: సంతమాగులూరు మండలంలోని అడవిపాలెంలోని నీలంపాటి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవం ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి మండలంతోపాటు పరిసర మండలాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి కుంకుమ పూజలు చేశారు. వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి తిరునాళ్ల నిర్వహించనుండటంతో ఎలక్ట్రిక్‌ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన పాట కచేరీలు అలరించాయి.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం కృత్తిక నక్షత్రం నవమి సందర్భంగా సోమదివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

అద్దంకి: ఎడ్యుకేషనల్ ఎపీఫణి మెరిట్ పరీక్ష విజేతలకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అదే విధంగా 15 మంది విజేతలకు రూ.20 వేలు విలువ చేసే మెటిరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పట్టణంలోని రామసుశీల నిలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ టీ వెంకట్రావు అధ్యక్షత వహించారు.

నిత్యం ధ్యానంతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న మువ్వల శ్రీకాంత్

వేటపాలెం: నిత్యం ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగా గురువు మువ్వల శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి యోగా గురువు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం, సాయంకాలం వేళల్లో యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ వలేటి సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఆవుల పున్నయ్య, కార్యదర్శి బూసం షణ్ముఖేశ్వరరావు, కోశాధికారి బీరక సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్. ప్రయాగరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ అన్నదాన సత్రం నూతన కమిటీ ఏర్పాటు



నూతనంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులు

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని యాదవ అన్నదాన సత్రం నూతన కమిటీ సభ్యులను ఆదివారం సత్రంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రిబోయిన శ్రీనివాసరావు, కార్యదర్శిగా పిన్నెబోయిన సుబ్బారావులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు సత్రం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జువ్విరాము, గిద్ద నాగయ్య, ఎర్రిబోయిన శ్రీనివాస్, ఐదు మండలాల యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దారు పీ. సుశీలాదేవి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు తమ అవసరాలపై అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

10,066 మంది రైతులకు రూ.2.11 కోట్ల సాయం

బల్లికురవ: ప్రభుత్వం మూడోవిడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం కింద 10066 మంది రైతులకు రూ.2.11 కోట్లు మంగళవారం ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమచేస్తారని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. మూడో విడత వైఎస్సార్ రైతు భరోసాలో కౌలు రైతులు 228 మంది, కొత్తగా దరఖాస్తు చేసుకున్న 146 మందితో కలిపి 1723500 పీఎం కిసాన్ ఆర్థిక సాయంలో 9692 మందికి ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున రూ.1.94 లక్షలు ఆర్థిక సాయం మంజూరైనట్లు చెప్పారు.

సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి

కంభం: నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేస్తూ పలు అవార్డులతో పాటు డాక్టరేట్ అందుకున్న పులి శ్రీనివాస ప్రసాద్ అభినందనీయుడని ప్రకాశం జిల్లా కాపునాడు కన్వీనర్ ఆమంచి స్వాములు, నెహ్రూ యువకేంద్ర ప్రాంతీయ కో ఆర్డినేటర్ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పులిశ్రీనివాస ప్రసాద్ దంపతులను సన్మానించారు. లయన్స్ క్లబ్ పీడీజీ విజయ్ చంద్, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రొటెక్షన్ ఉమెన్ సెల్ చైర్ పర్సన్ రావూరి అరుణతార, రిటైర్డ్ జెడ్పీ సీఈఓ దస్తగిరి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, కొత్తపల్లి నాగజ్యోతి పాల్గొన్నారు.

160 మందికి నేత్ర వైద్య పరీక్షలు

టంగుటూరు: రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావూరి వినీల 36వ జయంతి సందర్భంగా స్థానిక బ్రహ్మంగారి గుడి ఆవరణలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 160 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా 110 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి త్వరలోనే గుంటూరు శంకర ఆస్పత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

నాగేశ్వరస్వామివారి ఆలయ వార్షికోత్సవం

కారంచేడు: గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి 15వ వార్షికోత్సవం ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు తెలిపారు. మండంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన నాగేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, స్వామివారికి రుద్రాభిషేకాలు, పార్వతీ అమ్మవారికి కుంకుమార్చన, పంచముఖ ఆంజనేయస్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తారని కల్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిన భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

గ్రంథాలయంలో 1800 పుస్తకాలు

టంగుటూరు: టంగుటూరు గ్రంథాలయంలో 1800 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని జి.వర్ధనరాజు తెలిపారు. స్థానిక గ్రంధాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేసవిలో కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



కొరిశపాడు మండలంలో కోళ్లఫారం

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు

మేదరమెట్ల: వేసవిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండటం వలన కోళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో కోళ్ల దాణాతినడం తగ్గించి ఎక్కువగా నీటిని దిగడం ద్వారా గుడ్లు ఉత్పత్తి తగ్గడంతో పాటుగా రోగనిరోధక శక్తిని కోల్పోతాయి. అందు వలన కోళ్లకు వేసవి కాలంలో ఎక్కువగా పలు రకాల ప్రాణాంతక వ్యాధులు వచ్చి కోళ్లు చనిపోతుంటాయి. దీంతో కోళ్ల పెంపకం దారులకు కోళ్ల పెంపకం కష్టంగా మారడంతో రైతులకు వేసవిలో నష్టాలు మిగులుతున్నాయని కోళ్ల రైతులు చెప్తున్నారు.

రోగాలు: కొక్కెర, గంబోరా, కొరైజా, పౌల్‌ఫాక్స్, సీఆర్‌డీ వంటి రోగాలు వస్తుంటాయి. కోళ్ల పెంపకందార్లు వేసవిలో జాగ్రత్తలు పాటించి సక్రమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోళ్ల పెంపకంతో లాభాలు వచ్చేందుకు వీలుకలుగుతుంది.

- కోళ్ల షెడ్డులపై తాటాకు, గడ్డి, కొబ్బరి మట్టలు వంటివి కప్పిఉంచడం ద్వారా షెడ్డులోపలి ఉష్ణోగ్రత తగ్గుతుంది.
- ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి షెడ్లలో ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలి.
- షెడ్ల పైభాగంలో స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకొని షెడ్డు చుట్టూ పట్టలను కట్టుకొని నీటితో తడుపుతూ ఉండాలి.
- షెడ్డులో పరిమితికి మించి కిక్కిరిసినట్లు కోళ్లను ఉంచడం వలన కూడా రోగాలు వచ్చే ప్రమాదం ఉంటుంది.
- వేసవి తీవ్రతను బట్టి కోళ్లు వడదెబ్బకు గురి అవుతాయని తెలుసుకున్నప్పుడు నీటిలో ఎలక్ట్రోలైట్‌ను కలిపి కోళ్లకు ఇవ్వాలి.
- కిలో బరువు దాటిన కోళ్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి దాణాను ఇవ్వకుండా సాయంత్రం 5గంటలకు తడిపిన దాణాను మాత్రమే ఇవ్వాలి.
- కోళ్ల దాణాలో తప్పనిసరిగా సీ విటమిన్ కలిపి ఇవ్వాలి.
- వేసవిలో శుభ్రమైన నీటిని ఎల్లప్పుడూ కోళ్లకు అందుబాటులో ఉండేలా చూడాలి. నీటిలో శానిటైజర్లు కలిపి ఉంచాలి.
- కోళ్లకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలను వేయించాలి.
- వడదెబ్బ తగిలిన కోళ్లను నీటిలో కోడి తల మునగనీయకుండా తలకిందులుగా కోడిని నీటిలో ముంచడం వలన కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకుంటుంది.

ఇలాంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోళ్ల పెంపకం దారులకు వేసవిలోకూడా లాభాలు పొందేందుకు వీలు కలుగుతుందని నిపుణులు చెప్తున్నారు.